రైతులకు వెంటనే నష్టపరిహారం అందించాలి

- వైఎస్సార్‌సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ
- శలపాడులో నీట మునిగిన పంట పొలాలను పరిశీలించిన అంబటి



శలపాడులో పంట పొలాలను పరిశీలిస్తున్న అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: భారీ వర్షాలకు నీట మునిగి పంట దెబ్బ తిని నష్టపోయిన రైతులకు ప్రభుత్వం స్పందించి తక్షణమే నష్టపరిహారం అందించాలని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. చేబ్రోలు మండలం శలపాడు గ్రామంలో గురువారం బారీ వర్షాలకు నీట మునిగిన పంట పొలాలను అంబటి మురళీకృష్ణ పరిశీలించారు. శలపాడు, వీరనాయకునిపాలెం గ్రామాల మధ్య మోకాళ్ళ లోతులో ఉన్న పంట పొలాలను రైతులు, గ్రామస్తులు, పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో డీటీ శ్రీనివాసరావుకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ మూడు రోజులుగా కురుస్తున్న బారీ వర్షాలకు చేబ్రోలు మండలంలోని అన్ని గ్రామాల్లో పంట పొలాలు పూర్తిగా నీట మునిగిపోయాయన్నారు. ప్రతికూల వాతవరణ పరిస్థితుల కారణంగా ఇప్పటికే రెండు సార్లు రైతులు విత్తనాలు నాటారన్నారు. ప్రస్తుతం రైతాంగం పూర్తిగా నష్టపోయారన్నారు. ఎకరానికి సుమారు రూ.20 వేల వరకు నష్టపోయరన్నారు. గత ఏడాది కూడా రైతులు పంటలు దెబ్బతినటం, గిట్టుబాటు ధర లేకపోవటంతో నష్టపోయారన్నారు. కూటమి ప్రభుత్వం రైతు సమస్యలను పట్టించుకోవటం లేదని, సహాయ చర్యలు తీసుకోవటంలోనూ విఫలమైందని విమర్శించారు. మండల పరిధిలో సుమారు 20వేల ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగిపోయాయన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు పదివేల నష్టపరిహారం, ఎరువులను ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శలపాడు, వీరనాయకునిపాలెం గ్రామ సర్పంచ్‌లు మన్నెం శిరీష, యర్రాకుల అనితకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు మన్నెం వేణుగోపాలకరావు, యర్రాకుల వీరాంజనేయులు, పరిశీ చిరంజీవి, పి.పూర్ణచంద్రరావు, శేషిరెడ్డి, వెంకట్రామయ్య, పి.కోటేశ్వరరావు, శంకరరావు, పుల్లారెడ్డి, ఉదయ్ పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న అంబటి మురళీకృష్ణ

రైతు సంక్షేమాన్ని గాలికొదిలేశారు

పెదకాకాని: పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. పంట కాలువలకు గండ్లు పడటంతో పాటు కాలువ కట్టలు పొంగి పొర్లడంతో మండలంలోని ఆయా గ్రామాల్లో వరి పంట నీట మునిగింది. రెండు రోజులుగా నీటిలోనే నానుతున్న వరి పైర్లను గురువారం అంబటి మురళీకృష్ణ, స్థానిక రైతులు, నాయకులతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులు సంక్షేమాన్ని గాలికి ఒదిలేసిందన్నారు. తూటికాడ తూతూ మంత్రంగా తీసి 24 లక్షల రూపాయలు సొమ్ము చేసుకోవడంపై ఉన్న శ్రద్ధ కాలువ కట్టలను బలోపేతం చేయడంపై లేదన్నారు. ముమ్మాటికీ కూటమి నాయకులు, అధికారుల నిర్లక్ష్యమే రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. అనంతరం పెదకాకాని తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని మండలంలో పంట నష్టాన్ని గుర్తించి తక్షణమే ఒక్కొక్క రైతుకు పది వేలు రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని, ఎరువులు ఉచితంగా సరఫరా చేయాలని తహసీల్దార్ కృష్ణకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు గోళ్ళ స్వరూపరాణి (పెదకాకాని), పిట్టు శివకృష్ణారెడ్డి (అగతవరప్పాడు), ఎంపీటీసీ సభ్యురాలు షేక్ షహనాజ్, స్థానిక నాయకులు ముడియాల మల్లికార్జున రెడ్డి, వుయ్యూరి సతీష్‌రెడ్డి, తాడిబోయిన వేణు గోపాల్, మందాళ శివారెడ్డి, భీమవరపు కృష్ణారెడ్డి, దాన బోయన నాగేశ్వరరావు, దంతాల శ్రీనివాసరావు, కొండమడుగుల శ్రీనివాసరెడ్డి, సుంకర కృష్ణారెడ్డి, ఫ్రాన్సిస్, బండ్లమూడి బానుకిరణ్, ఆర్ధల బ్రహ్మం, మున్నంగి రాంబాబు, ఉల్లంగుల శ్రీనివాసరావు, పోతురాజు గోపి పాల్గొన్నారు.

బాలుడి మృతి బాధాకరం



బాలుడి తండ్రి సురేష్‌ను పరామర్శిస్తున్న అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: వరద ఉధృతికి ప్రమాదవశాత్తూ కాలు జారి నీటిలో పడి బాలుడు మృతి చెందడం బాధాకరమని పొన్నూరు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. పెదకాకాని మండలంలోని నంబూరు గ్రామంలో 14 ఏళ్ళ బాలుడు నీటిలో మునిగి చనిపోయిన సమాచారం తెలుసుకున్న అంబటి మురళీకృష్ణ గురువారం స్థానిక నాయకులతో కలసి వారి ఇంటికి చేరుకున్నారు. మృతి చెందిన బాలుడు నేలపాటి యోహాన్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాలుడు తండ్రి నేలపాటి సురేష్‌తో ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. దాదాపు 30 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు మురుగునీరు బయటకు వెళ్ళేందుకు చిన్న చప్టా కట్టడం, ఆ చప్టా లోనూ తూటికాడ అడ్డు పటడంతోనే ఉధృతంగా పొంగి ప్రవహిస్తుందన్నారు. నివాళులర్పించిన వారిలో స్థానిక నాయకులు వుయ్యూరు సతీష్‌రెడ్డి, మందాళ శివారెడ్డి, భీమవరపు కృష్ణారెడ్డి ఉన్నారు.

సమస్యలుపరిష్కరించకుంటే ఆందోళన చేస్తాం



గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించకుటే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ తెలిపారు. గురువారం జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుకను డీఈఓ కార్యాలయంలో కలిసిన యూటీఎఫ్ ప్రతినిధి బృందం వివిధ సమస్యలపై ఆమెకు వినతి పత్రం సమర్పించారు. ఎంఈఓలకు ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించడంలో నిర్దిష్టమైన విధానం లేకుండా పోయిందని, కమిషనర్ ఆదేశాలను పాటిస్తూ ఆర్జేడీ ఉత్తర్వుల ప్రకారం ఎస్.అజయ్‌కుమార్‌కు తుళ్లూరు ఎంఈఓగా బాధ్యతలు అప్పగించాలని కోరారు. ఎంఈఓలను ఇష్టారాజ్యంగా మార్చడం తగదన్నారు. ఉపాధ్యాయుల డిప్యూటేషన్ల ప్రక్రియ పారదర్శంగా జరగాలని, కొంత మంది ఉపాధ్యాయల పట్ల ఉదాసీనంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఉపాధ్యాయుల వేతనాలకు సంబంధించి బిల్లులను ఎమ్మార్సీల్లోని సిబ్బందే చేయాల్సి ఉండగా, ఆయా విధులను ఉపాధ్యాయులతో చేయిస్తున్న ఎంఈఓలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని స్పష్టం చేశారు. డీఈఓను కలిసిన వారిలో సంఘ జిల్లా సహాధ్యక్షుడు జి. వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, జి.వెంకటేశ్వరరావు, ఎం.గోవిందయ్య, ఎండీ షకీలాబేగం, ఎ.శ్రీనివాసరావు, కె.కేదార్‌నాథ్ ఉన్నారు.

క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



పెదకాకాని: ప్రమాదవశాత్తూ నీటి ప్రవాహానికి కొట్టుకుపోయి మరణించిన నేలపాటి యోహాన్ కుటుంబానికి స్థానిక ఎమ్మార్పీఎస్ యూత్ 52 వేల రూపాయలు ఆర్థికసాయం చేసింది. మండలంలోని నంబూరు విజయభాస్కర్ నగర్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థి నేలపాటి యోహాన్ చప్టాలో కాలు జారి పడి మరణించిన సంగతి విదితమే. మృతుడి తల్లిదండ్రులు నేలపాటి సురేష్, ఎస్తేరు రాణిలకు అందజేశారు.

ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర అమలు చేయాలి



పొన్నూరు: ఎన్నికలకు ముందు ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీని అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఆరేటి రామారావు విమర్శించారు. ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం పట్టణంలోని ఐలాండ్ సెంటర్లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర అమలు చేస్తామని రూ.15 వేలు ప్రతి ఆటో డ్రైవర్ కి ఇస్తామని హామీ ఇచ్చారని, నేటికి ఆ హామీ అమలుకు నోచుకోలేదని అన్నారు. అలాగే ఆటో ట్యాక్స్ రద్దు చేస్తామని, భవన నిర్మాణ కార్మికుల వలె ఆటో డ్రైవర్లు కూడా సంక్షేమ బోర్డుని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎం. సత్యనారాయణ మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేసిందని దాని వల్ల ఆర్టీసీ నష్టపోవడమే కాక ఆటో డ్రైవర్లకు రోజువారి ఆదాయం పడిపోయి జీవన భృతిని కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి సంవత్సరం గడిచిపోయినా నేటికీ ఆ హామీని అమలు చేయలేదని వెంటనే హామీలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పొన్నూరు పట్టణ కార్యదర్శి జంపనీ గోవిందరాజు, కార్యదర్శి కూచిపూడి రత్నబాబు, సుబ్బయ్య, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, రాఘవయ్య, ప్రేమ్ చందు, రాంబాబు, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

కట్టలకు మరమ్మతులు చేయాలి

పెదకాకాని: సీపీఎం ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ముంపుకి గురై నీట మునిగిన పొలాలు, చెరువు కట్టలు, గుంటూరు ఛానల్ కాలువ కట్టలు, నంబూరు నుంచి కాజా మార్గంలో మురుగునీరు పారే చప్టా, నంబూరు నుండి చిలువూరు మార్గంలో మురుగునీరు పారే చప్టా, నంబూరు, పేదలు నివసించే కాలనీలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు పాశం రామారావు, మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు నంబూరు శాఖ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు కౌలు రైతు సంఘం నాయకులు నీలాంబరం రైతులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట రూ.40లక్షలు స్వాహా

పట్నంబజారు: ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట గుర్తుతెలియని వ్యక్తి మోసం చేసి రూ. 40 లక్షలు కాజేసిన ఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జున్నుసాహెబ్ నగర్‌లో నివాసం ఉండే సయ్యద్ మస్తాన్‌వలి ఆర్మీలో ఉద్యోగం చేసి, 20 సంవత్సరాల క్రితం రిటైర్డ్ అయ్యారు. నెలరోజుల క్రితం వాట్సాప్ నంబరుకు ఆన్‌లైన్ ట్రేడింగ్‌కు సంబంధించి ఓ గుర్తుతెలియని వ్యక్తి మెసేజ్ పెట్టాడు. పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని చెప్పి నమ్మబలికాడు. దీంతో మస్తాన్‌వలి అతని మాటలు నమ్మి విడతల వారీగా రూ. 40 లక్షలు పెట్టుబడి పెట్టాడు. సదరు వ్యక్తి వాట్సాప్ పనిచేయకపోగా, ఫోన్ కూడా ఎత్తకపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పొలాన్ని వీడని నీళ్లు



రెండు రోజుల క్రితం చేబ్రోలు మండలంలో కురిసిన భారీ వర్షంతో పంట పొలాలు నీట మునిగాయి. గురువారం కూడా పొలాల్లోని వరద నీరు బయటకు కదలకపోవటంతో రైతులు పంట ఉరకెత్తి చచ్చిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. చేబ్రోలు మండలంలోని శలపాడు, శేకూరు, వీరనాయకునిపాలెం, వడ్లమూడి, చేబ్రోలు, నారాకోడూరు, మంచాల, సుద్దపల్లి తదితర గ్రామాల్లో పొలాల్లో చేరిన వర్షపు నీరు ముంపు నుండి బయట పడలేదు. కాలువలు, డ్రైయిన్లు పొంగి ప్రవహించటంతో పొలాల్లోని నీరు బారీగా చేరింది. వివిధ గ్రామాల్లోని పొలాల్లో చేరిన వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవటంతో బెంబేలెత్తుతున్న రైతాంగం గురువారం మరోసారి కొద్దిపాటి వర్షం కురవటంతో రైతులు మరింత కలత చెందారు. –చేబ్రోలు

మానవ హక్కుల పరిరక్షణలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ కీలక పాత్ర

- న్యూఢిల్లీలోని నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ మెంబర్ విజయ భారతి సయాని
- విజ్ఞాన్ యూనివర్సిటీలో మానవ హక్కులపై నేషనల్ వర్క్‌షాప్



మాట్లాడుతున్న న్యూఢిల్లీలోని నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ మెంబర్ విజయ భారతి

చేబ్రోలు: మానవ హక్కులకు భంగం కలిగినప్పుడు బాధితుల తరఫున విద్యార్థులు తమ స్వరాన్ని వినిపించాలని న్యూఢిల్లీలోని నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ మెంబర్ విజయ భారతి సయాని అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'రోల్ ఆఫ్ ఎన్‌హెచ్‌ఆర్‌సీ (నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్) ఇన్ ప్రొటెక్షన్ ఆఫ్ ఫండమెంటల్ అండ్ హ్యూమన్ రైట్స్'అనే అంశంపై జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషన్ మెంబర్ విజయ భారతి సయాని మాట్లాడుతూ వ్యక్తుల ప్రాణం, స్వేచ్ఛ, గౌరవం, సమానత్వం వంటి మౌలిక హక్కులను కాపాడటంలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. ప్రభుత్వ సంస్థలు, పోలీసు, లేదా ఇతర అధికారుల అధికార దుర్వినియోగం వల్ల హక్కులు ఉల్లంఘించబడినప్పుడు, బాధితుల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించడమే కాకుండా తగిన న్యాయం చేకూరుస్తామన్నారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు గురించి విద్యార్థులకు వివరించారు. 14 సంవత్సరాల లోపు పిల్లలను ప్రమాదకరమైన పనుల్లో పని చేయించడం నిషేధమన్నారు. అనంతరం 'లీగల్ లిటరసీ అండ్ అవేర్‌నెస్ కాంపెయిన్ అండ్ కాంపీటీషన్స్ ఆన్ చైల్డ్ రైట్స్–2025'కు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్, డీన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు మాకొద్దు

గుంటూరు 178వ సచివాలయం ముట్టడించిన సీపీఎం నాయకులు



ఐద్వానగర్ వాసులతో మాట్లాడుతున్న గోనే లూథర్‌పాల్

లక్ష్మీపురం: ఇప్పటికే పెరిగిన కరెంటు చార్జీలతో ప్రజలు సతమతమవుతుంటే ప్రజలను నిలువునా దోచుకునే స్మార్ట్ మీటర్లను జనాల మీదకు వదలడం అన్యాయమని సీపీఎం నాయకులు గోనే లూథర్ పాల్, ఆది నిక్సన్ అన్నారు. గుంటూరు స్వర్ణభారతినగర్‌లోని ఐద్వానగర్ 178వ సచివాలయ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు పెట్టించుకోకపోతే ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు వర్తించవని చెప్పి అమాయకులైన ప్రజలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను పగలగొట్టండి అని చెప్పిన నాయకులే ఇప్పుడు స్మార్ట్ మీటర్లు పెట్టించే పనిని వేగవంతం చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సత్వరం ఇప్పటికే బిగించి ఉన్న స్మార్ట్ మీటర్లను తొలగించి వాటి స్థానంలో పాత డిజిటల్ మీటర్లను మళ్లీ బిగించాలని డిమాండ్ చేశారు.

అలరించిన శ్రీకృష్ణ భక్తి గీతాలాపన

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం పద్మావతీ కల్యాణ వేదికపై గురువారం శ్రీకృష్ణ భక్తి గీతాలాపన నిర్వహించారు. భక్త నారద గానసభ ఆధ్వర్యంలో జరగ్గా, ఆలయ పాలకవర్గ కమిటీ జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన ఏపీ విశ్రాంత డీజీపీ ఎం.మాలకొండయ్య, కాళహస్తి సత్యనారాయణలు మాట్లాడారు. అనంతరం సుప్రసిద్ధ సంగీత విద్వాంసులు డాక్టర్ ఆకురాతి కోదండరామయ్య గీతాలను ఆలపించారు. ఆలోకమే శ్రీబాలకృష్ణం, సతులాల చూడరే, రాధాసమేత కృష్ణ, లీలా శ్రీకృష్ణయ్య, ముద్దుగారే యశోద, సామజవరగమన, జోఅచ్యుతానంద జోజో ముకుందా తదితర కృష్ణ భక్తిగీతాలు అలరించాయి. వయోలిన్‌పై డాక్టర్ ఆంజనేయశాస్త్రి, తబలాపై బాలాజీ వాయిద్య సహకారం అందించారు.